క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

బ్రహ్మంగారిమఠం : మండలంలోని తోట్లపల్లె పంచాయతీలో బుధవారం ఉదయం 7 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పాల్గొంటారని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

గాదెగూడూరులో ..

రాజుపాళెం : మండలంలోని గాదెగూడూరు గ్రామంలో బుధవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ పోలా వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలా వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వస్తున్నారని ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ముగ్గుల పోటీలు

ఖాజీపేట : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముందస్తుగా ఖాజీపేట ఆర్యవైశ్య సంఘం సభ్యులు మంగళవారం ముగ్గలపోటీలను నిర్వహించారు. వాసవీక్లబ్, ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో గెలుపొందిన వారికి సంతూర్ వారి న్యూ బాలాజీ ట్రేడర్స్ వారు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, వాసవీక్లబ్ అధ్యక్షుడు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం


వరికూటి నాగిరెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు : స్థానిక జమ్మలమడుగు రోడ్డులో నివసిస్తున్న వరికూటి నాగిరెడ్డి (82) మంగళవారం ఉదయం మృతి చెందాడు. వారి సమీప బంధువైన డాక్టర్ రాజారామ్మోహన్‌రెడ్డి వరికూటి నాగిరెడ్డి ఇంటికెళ్లి ఆయన సతీమణి ఇందిరాదేవి, కుమారులు నరేంద్ర మోహన్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డిలను ఒప్పించి నేత్ర దానం చేయించారు. డాక్టర్ వైపీ లక్ష్మీదేవి ఐబ్యాంకు నిర్వాహకుడు మధుసూదన్‌రెడ్డి మృతుడి నుంచి రెండు కార్నియాలను సేకరించి హైదరాబాద్‌కు పంపారు. మరణానంతరం ఎవరైనా ఆరు గంటల్లోపు నేత్ర దానం చేయవచ్చునని, దీంతో మరో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించవచ్చని మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 9885339306 సంప్రదించాలని కోరారు.

కరపత్రాల విడుదల


కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బద్వేలు అర్బన్ : అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) కడప జిల్లా 18వ మహాసభల కరపత్రాలను మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.పవన్, జి.వలరాజులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలు సాగిస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా 18వ మహాసభలు ఫిబ్రవరి 7, 8, 9వ తేదీల్లో ప్రొద్దుటూరులో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. విద్యార్థులు వేలాదిగా తరలివచ్చి మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి అశోక్, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ సహాయ కార్యదర్శి పాలకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంటీఎఫ్ డైరీ ఆవిష్కరణ


కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నడింపల్లె మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు టీవీ పద్మావతి ఏపీఎంటీఎఫ్ రూపొందించిన 2023 డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎంటీఎఫ్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఎండీ రఫివుద్దీన్, ఆసీఫ్ హుసేన్, మోహన్‌రెడ్డి, కుళ్లాయప్ప, మధుసూదన్‌రెడ్డి, గంగాదేవి, సుజాత పాల్గొన్నారు.

చర్చి స్థల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

చాపాడు : పెద్దగురువళూరు పంచాయతీ శ్రీరాములపేటలో చర్చి కోసం కేటాయించిన స్థలాన్ని గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆక్రమించారని వీరిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం దళిత క్రైస్తవులు మండల తహసీల్దారు సుభానీకి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఆస్థలంలో వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి ఇళ్లు నిర్మించుకున్నాడని, ఇదే క్రమంలో కుమ్మపాప వీరయ్య అనే వ్యక్తి స్థలం ఆక్రమించి ఇళ్లు నిర్మించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని దళిత క్రైస్తవులు తహసీల్దారును కోరారు.

మంచుకురిసె .. మనసు మురిసె


బైపాస్ రోడ్డులో కమ్ముకున్న పొగమంచు


పొగ మంచు కారణంగా లైట్ల వెలుతులో వస్తున్న వాహనదారులు

బద్వేలు పట్టణానికి మంచుదుప్పటి కప్పుకుంది. మంగళవారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేయడంతో ఊటీ వాతావరణం తలపించింది. తెల్లవారుజామునే వాకింగ్‌కు వెళ్లే పాదాచారులు, వివిధ రకాల పనుల కోసం బయటికి వచ్చిన ప్రజలు ప్రకృతి రమణీయతను చూసి పరవశించిపోయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దట్టమైన పొగమంచు ఏర్పడటంతో ప్రజలు సంబరపడిపోయారు.
మరోవైపు దట్టమైన పొగమంచు కారణంగా వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. తెల్లవారినప్పటికీ హెడ్‌లైట్లు వేసుకుని వాహనాలను నడపాల్సి వచ్చింది.
– బద్వేలు అర్బన్

బస్సు సర్వీసులను యథావిధిగా కొనసాగించాలి

బద్వేలు అర్బన్ : బద్వేలు నుంచి అనంతపురానికి వెళ్ళే బస్సు సర్వీసు వేళలను గతంలో ఉన్న ఉదయం 7 గంటల సమయానికే కొనసాగించాలని ప్రయాణికులు మంగళవారం ఆర్టీసీ డీఎంకు వినతి పత్రం సమర్పించారు. గత కొన్నేళ్ళుగా ఉదయం 7 గంటలకే ఉన్న వేళను 8 గంటలకు మార్చడం వలన విద్యార్థులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పాత సమయంలోనే బస్సు సర్వీసును నడపాలని కోరారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సుభాని



ప్రొద్దుటూరు : చాపాడు మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న జె.సుభాని ప్రొద్దుటరు మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ నజీర్ అహ్మద్ నెల రోజుల పాటు సెలవులో వెళ్లారు.

ఉక్కు పరిశ్రమను త్వరగా ఏర్పాటు చేయాలి


వినతి పత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఉక్కు పరిశ్రమను త్వరగా ఏర్పాటు చేయాలని ఉక్కు సాధన ఐక్యవేదిక ఆధ్వర్యంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఇన్‌చార్జి తహసీల్దార్ సుభానికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలిపారు. సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్, కృష్ణ, రాజు, రవి పాల్గొన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలి

పోరుమామిళ్ల : కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణలు త్వరగా చేపట్టాలని మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్లకార్డ్స్‌తో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి మాట్లాడుతూ ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం జరిగితే ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షాయాభైవేల మంది యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేయాల్సిన ఉన్న పనులు ప్రారంభం కాలేదన్నారు. నిరుద్యోగులకు సంజీవని లాంటి ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు త్వరగా జరగాలన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, చెన్నకృష్ణ, లోకేష్, పీరయ్య, కుమార్, పవన్ పాల్గొన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి

మైదుకూరు : సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని ఉక్కు సాధన ఐక్యవేదిక ఆధ్వర్యంలో మైదుకూరు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డికి ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్‌కుమార్, ఉక్కు సాధన ఐక్యవేదిక కన్వీనర్ సుబ్బరాయుడులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి జిల్లాలో ఉక్కు పరిశ్రమకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎద్దు రాహుల్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రి రికార్డుల పరిశీలన


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ

రాజుపాళెం : రాజుపాళెంలోని పీహెచ్‌సీని మంగళవారం సాయంత్రం డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ ఆకస్మికంగా సందర్శించారు.ముందుగా ఆస్పత్రికి సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది సమయానికి హాజరు కావాలని అన్నారు. ఆస్పత్రి లోపల, బయట పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఎన్‌సీడీ, సీడీ సచివాలయాల వారికి మానిటరింగ్ చేసి ఈనెల 25వ తేదీలోపు 92 శాతం సాధించాలని తెలిపారు. హైరిస్క్ గర్భిణులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు నిఖిల, మంజుల, పీహెచ్ఎన్ విమలమ్మ, ఎంపీహెచ్ఈఓ రవిశంకర్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రశాంతి

కాశినాయన : గ్రామాల్లో అందిస్తున్న వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి అన్నారు. మంగళవారం మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామ సచివాలయంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 55 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో షుగర్, బీపీ ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నామన్నారు. మందులను సక్రమంగా వాడాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ, హెచ్ఐవీ పరీక్షలూ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కనక దుర్గ అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు


కనకదుర్గ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : విజయవాడలోని శ్రీకనకదుర్గ అమ్మవారిని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మంగళవారం ఉదయం దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆయనను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరు నాగేంద్రరెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాకర్ల నాగశేషారెడ్డి పాల్గొన్నారు.

ఆగ్రోస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నారాయణరెడ్డి



బద్వేలు అర్బన్ : ఏపీ ఆగ్రోస్ ఎంటర్‌ప్రైజర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బద్వేలుకు చెందిన సూరా వీరనారాయణరెడ్డి ఎన్నికయ్యారు. మున్సిపాలిటీ పరిధిలోని బోవిళ్ళవారి పల్లె గ్రామానికి చెందిన ఈయన బద్వేలు ఆగ్రోస్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. విజయవాడలోని ఆగ్రోస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్న నూతన కార్యవర్గంలో ఆయన్ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగ్రోస్ రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువస్తామని తెలిపారు.

ప్రతి మహిళ లక్షాధికారి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం


మాట్లాడుతున్న మెప్మా అధికారి గంగులయ్య

పులివెందుల రూరల్ : ప్రతి మహిళ లక్షాధికారి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మెప్మా అధికారి గంగులయ్య తెలిపారు. మంగళవారం స్థానిక మెప్మా కార్యాలయంలో పొదుపు సంఘాల మహిళలు, ఆర్పీలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల నెరవేర్చే విధంగా సుమారు ప్రజల కోసం 8 వేల ఇళ్లను జగనన్న కాలనీలో నిర్మించడం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు అర్హులైన లబ్ధిదారులందరూ సహకరించాలన్నారు. రూ.35 వేలు చెల్లించి హౌసింగ్ కాలనీలో ఇళ్లు వేగవంతమయ్యే విధంగా చేపట్టాలన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఓ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

రెడ్ల సంక్షేమానికి కృషి

రాజుపాళెం : రాష్ట్రంలో రెడ్ల కులస్తుల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారుపల్లె జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన రాజుపాళెంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని కులాలను కలుపుకొని రెడ్లు అభివృద్ధి చెందాలన్నారు. రెడ్లు అన్ని కులాలకు, మతాలకు సహాయ సహకారాలు అందిస్తూ తిరుగులేని విధంగా అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ద్వారా పేద, ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి కులస్తులకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు.

19న వేమన పద్యాల పోటీలు

పోరుమామిళ్ల : యోగివేమన జయంతి సందర్భంగా ఈ నెల 19న బద్వేలు నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాలల విద్యార్థులకు వేమన పద్యాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి తెలిపారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు, వేమన పద్యాల పుస్తకాలు, ప్రశంసాపత్రం అనంతపురం వేమన ఫౌండేషన్ వారు ఇస్తారన్నారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ, అవగాహన కల్పించేందుకు ఈ పద్య పోటీలు తోడ్పడతాయన్నారు. వివరాలకు 9441932390 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన చెప్పారు.

టెన్నికాయిట్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ

కడప స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా టెన్నికాయిట్ బాలికల జట్టుకు హ్యాపీ కిడ్స్ కరస్పాండెంట్ పి. శివకుమారి క్రీడా దుస్తులను అందజేశారు. ఈనెల 11, 12 తేదీల్లో అనకాపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఆమె టీషర్ట్స్ పంపిణీ చేశారు. అమీల్, అంకన్న, శివశంకర్, రవిశంకర్, శేఖర్ పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో సంక్రాంతి సంబరాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. భవిత కేంద్రంలోని మానసిక దివ్యాంగుల చిన్నారులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో భోగిపండ్లు వేసి ఆశీర్వదించారు. ఆట వస్తువులను అందించారు. కార్యక్రమంలో భవిత కేంద్రం రీసోర్స్ పర్సన్ సంగీత, ఆదరణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

పెద్ద దర్గాలో నేటి నుంచి ఉరుసు

కడప కల్చరల్ : ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రమైన కడప నగరంలోని అమీన్‌పీర్ (పెద్ద)దర్గాలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రస్థాయి హాకీ టోర్నీకి ఎంపిక


రాష్ట్రస్థాయి హాకీటోర్నీకి ఎంపికైన క్రీడాకారులు

పులివెందుల టౌన్ : రాష్ట్రస్థాయి హాకీ క్రీడా పోటీలకు పులివెందుల సీనియర్ ఉమెన్స్ క్రీడాకారులు ఎంపికైనట్లు పులివెందుల ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జి శేఖర్, సీనియర్ హాకీ క్రీడాకారుడు అనీల్‌కుమార్, ఖేలో ఇండియా కోచ్ రవిలు తెలిపారు. ఈనెల 8వ తేదీన కడపలోని డీఎస్ఏ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎంపికల్లో పులివెందులకు చెందిన క్రీడాకారులు లావణ్య, హరిత, పుష్పావతి, సోనాలి శ్రేయాభాయిలు ఎంపికయ్యారని.. ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.

ప్రయాణికులకు సరైన సౌకర్యాలు కల్పించాలి


ఆర్టీసీ ఈడీకి వినతిపత్రమిస్తున్న నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తమతమ స్వస్థలాలకు వెళ్లే ప్రయాణికులకు ఆర్టీసీ సరైన సౌకర్యాలు కల్పించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు కోరారు. మంగళవారం ఈ మేరకు వారు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపినాథ్‌రెడ్డికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు టిక్కెట్ ధరలను అమాంతంగా పెంచి ప్రజలను దోచుకుంటున్నారన్నారు.దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ సభ్యులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములను డిజిటల్ ల్యాండ్ రికార్డులో చేర్చాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కేటాయించిన వక్ఫ్ బోర్డు ఆస్తులను డిజిటల్ ల్యాండ్ రికార్డుల్లో చేర్చాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ హక్కు డిజిటల్ సర్వేలో వక్ఫ్ గెజిట్‌లో ఆస్తులన్నింటిని చేర్చి సమగ్రంగా ఉండేట్లు జిల్లాలోని తహశీల్దార్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ముస్లిం మైనార్టీలకు అభివృద్ధికి ఉపయోగపడాల్సిన రూ. కోట్ల వక్ఫ్ బోర్డు ఆస్తులు తప్పుడు డాక్యుమెంట్లతో పరుల పాలు అవుతున్నాయని ఆరోపించారు.

పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యత

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

కలసపాడు : జీవితకాలం పాటు ప్రజలకు, ప్రభుత్వానికి సేవ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయుల పదవీ విరమణ అనంతరం పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యతని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలసపాడులో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారంలోపు సీపీఎస్‌ను రద్దు చేస్తామని చెప్పిన హామీని ఇంత వరకు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసిన రాష్ట్రాలకు ఇప్పటి వరకు జమ చేసిన నిల్వలను ఇవ్వడం సాధ్యం కాదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి ప్రకటన చూస్తే సీపీఎస్ రద్దు విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో అర్థమవుతుందని తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలే తప్ప ఎలాంటి ప్రత్యామ్నాయాలను అంగీకరించేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ వాకా చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, ప్రసాద్, రమణారెడ్డి, వెంకట్రామయ్య, సి.వెంకటరెడ్డి, సుబ్రమణ్యం, ప్రదీప్ పాల్గొన్నారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు

ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో ఆర్టీఓ సుశీల


ట్రావెల్స్ యజమానులతో మాట్లాడుతున్న ఆర్టీఓ సుశీల

ప్రొద్దుటూరు క్రైం : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రైవేట్ ట్రావెల్స్‌లో అధిక చార్జీలు వసూలు చేస్తే కేసులు నమోదు చేస్తామని ప్రొద్దుటూరు ఆర్టీఓ సుశీల తెలిపారు. స్థానిక ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ప్రొద్దుటూరులోని ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో ఆర్టీఓ సమావేశం నిర్వహించారు. అధిక చార్జీలు వసూలు చేస్తున్నట్లు ప్రయాణికుల నుంచి ఫిర్యాదు వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాధారణ చార్జీల కంటే అధికంగా వసూలు చేస్తే 9154294226 అనే ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంవీఐలు వేణు, నారాయణనాయక్, ఏఓ కరిముల్లా పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత వెలిదండ్ల జట్టు


వెలిదండ్ల జట్టుకు మెమెంటోను అందిస్తున్న నిర్వాహకులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని సీఎస్ఐ చర్చి క్రీడా మైదానంలో మంగళవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన వాలీబాల్ టోర్నీ విజేతగా వెలిదండ్ల జట్టు నిలిచింది. అంతకమునుపు ఈ పోటీలను పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ సెక్రటరీ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్పలు ప్రారంభించారు. ఈ పోటీలో 13 వాలీబాల్ జట్లు పాల్గొనగా.. అందులో వెలిదండ్ల, పులివెందుల సీఎస్ఐ సీనియర్స్ జట్లు ఫైనల్‌కు చేరాయి. వెలిదండ్ల జట్టు విజయం సాధించి మొదటి బహుమతి కింద రూ.3వేల నగదుతోపాటు మెడల్స్, మెమెంటోలను అందుకున్నారు. అలాగే పులివెందుల సీఎస్ఐ సీనియర్స్ జట్టు రన్నర్స్‌గా నిలిచి రూ.2వేల నగదుతోపాటు మెడల్స్, మెమెంటోలను అందుకున్నారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రాజు, న్యాయ నిర్ణేతలు శ్రీకాంత్ రెడ్డి, ఫ్రాన్సిస్, రవికుమార్, ప్రభాకర్‌రెడ్డి, విక్టర్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆలిండియా అథ్లెటిక్స్‌లో వైవీయూ క్రీడాకారుడి ప్రతిభ

వైవీయూ : అఖిల భారత విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో యోగివేమన విశ్వవిద్యాలయం క్రీడాకారుడు నక్కా రాజేష్ 7వ స్థానంలో నిలిచాడు. చెన్నైలో నిర్వహిస్తున్న అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో అథ్లెటిక్స్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో 49.23 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి సత్తాచాటి టాప్–10లో నిలిచాడు. విశ్వవిద్యాలయ క్రీడాబోర్డు కార్యదర్శి డా. కె. రామసుబ్బారెడ్డి, శిక్షకుడు డా. కె. కృష్ణారెడ్డి తదితరులు రాజేష్‌ను అభినందించారు.